# దారితప్పాం!

**పేజీ కథ**

**- ఆకాంక్ష**

అనగనగా విప్లవ్! ఎప్పుడో తన చిన్నతనంలో - అడవిలో లేళ్లూ, కుందేళ్లూ,నెమళ్లూ, ఏనుగులూ, ఇంకా ఎన్నెన్నో వుంటాయని స్నేహితులు చెప్పింది విని ఆ అడవి అందాలను చూద్దామని - వీలైతే కొన్ని పట్టుకొద్దామని... స్నేహితుల్తో బయల్దేరాడు.

ఎంత దూరం వెళ్ళినా - వాళ్ళక్కావాల్సిన వేవీ కన్పించలేదు... ఎప్పుడోసారీ ఏ జింకో - నెమలో దొరికినట్టే దొరికి చేజారిపోయేదే తప్ప - చేతికి ఏదీ చిక్కేదే కాదు!

ఎక్కడ చూసినా - దట్టమైన కీకారణ్యం... ముళ్లపొదలు! మొదట్లో ఉన్న ఉత్సాహం నీరు కారిపోయిందేమో-ఫ్రెండ్సందరికీ అమ్మా నాన్నలు గుర్తొచ్చారు!

"వద్దొద్దు! వెనక్కి వెళ్లిపోదాం!"అన్నారు కొందరు.

"కాదు...ముందుకే వెళ్దాం!" అన్నారు మరికొందరు.

వాదోపవాదాల్తో అలసిపోయి...అందరూ ఒకచోట చతికిల పడ్డారు.

విప్లవ్‌కి చిన్నగా కునుకుపట్టింది!

లేచిచూస్తే ఫ్రెండ్సెవరూ కన్పించలేదు.!

గుండె గుభిల్లుమంది! అటూ ఇటూ వెదికితే. చెట్టెక్కి అడవి పళ్ళు తెంపుతోన్న ఇద్దరు ఫ్రెండ్స్ కనిపించారు.



"మిగతా వాళ్లంతా ఏమయ్యారు?" అడిగాడు.

"వాళ్లకీ ప్రయాణం నచ్చలేదట! వెనక్కి వెళ్లిపోయారు." అని నవ్వారు.

"పిరికి వెధవలు! వెళ్తే వెళ్లారు - మనం మాత్రం ఛస్తే వెళ్లొద్దు!" అన్నాడు విప్లవ్ దృఢంగా.

అలా మరికొంత దూరం వెళ్లారు.

కొన్ని రోజులు పోయాక..... మిగతా ఇద్దరు ఫ్రెండ్స్‌క్కూడా నీరసముంచుకు వచ్చింది!

"లాభం లేదు! మనం సాధించింది ఏమీ లేదు! వెనక్కిపోదాం!" అన్నారు.

విప్లవ్ ఒప్పుకోలేదు.

"నోనో! ఇంత దూరం వచ్చింది... వెనక్కి వెళ్లడానికా?

"లేదు.... మనకు కావల్సింది దొరికేదాకా ఈ అడవుల్లోంచి వెళ్లేదే లేదు!" భీష్మించు కున్నాడు.

ఓ రాత్రి... విప్లవ్ గాఢనిద్రలో వున్నప్పుడు.. ఫ్రెండ్సిద్దరూ చల్లగా జారుకున్నారు!.

ఇప్పుడు.. విప్లవ్... ఒంటరిగా తిరుగు తున్నాడేమో... ప్రతి దానికీ ఉలికులికి పడ్తున్నాడు!

దారి కన్పించడం లేదు!

ఏది తూర్పో ఏది పడమరో తెలీడం లేదు!

ఎప్పుడే పులి మీద పడ్తుందో... ఏ పురు గు ఎక్కడ కాటేస్తుందో... అని అనుక్షణం వణికి పోతున్నాడు!

ఏ ఎండుటాకు శబ్దమైనా... అలర్ట్ అయిపోతున్నాడు!

దొరికితే అడవి ఫలాలూ - దొరక్కపోతే కప్పలూ - మిడతలూ, ఉడతలూ - కంటికి కన్పించిందల్లా తింటూ దారికోసం అన్వేషిస్తున్నాడు!

"ఏయ్ ఎవరక్కడ?"

విప్లవ్‌కి అకస్మాత్తుగా ఆ కీకారణ్యంలో ఓ వ్యక్తి కేక విన్పించి - భయంతో బిగిసు కు పోయాడు!

ఆ వ్యక్తి విప్లవ్ దగ్గరకు వచ్చాడు.

"ఈ ఘోర అరణ్యంలో... మీరు!".

"దారి తప్పాను"

"ఎక్కడికి వెళ్ళాలి?"

"మరిచి పోయాను"

అతడు విప్లవ్ వంక ఆశ్చర్యంగా చూసాడు. విప్లవ్ అతన్ని అనుమానంగా చూశాడు.

" మీరు..."

"నేను ఫారెస్ట్ గార్డ్‌ని!"

"నన్నీ అడవి దాటిస్తారా?"

"నేను ప్రభుత్వోద్యోగిని!? నేనీ అడవిని కాపలా కాయాలి, ' నేనిక్కడి నుండి కదల కూడదు, సారీ... మీతో రాలేను!" అంటూ ఫారెస్ట్ గార్డ్ వెనక్కి తిరక్కుండా గబగబా వెళ్లిపోయాడు.

దారితప్పిన విప్లవ్.. ఇప్పటికీఆ కీకారణ్యంలో ఒంటరిగా తిరుగుతూనే వున్నాడు! ★